RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 188 | జూన్ 21, 2025 | వెల : రూ.3-00



**సేవే లక్ష్యం**

4లో..



## దాతల సహకారం అభినందనీయం

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఎంజీఎం పీడియాట్రిక్ విభాగంలో దాతలతో కలసి పరికరాలను ప్రారంభించిన కలెక్టర్

**వేద న్యూస్, వరంగల్ :**

ఎంజీఎం ఆసుపత్రిలో పీడియాట్రిక్ విభాగానికి పరికరాలు అందించిన దాతల సహకారం అభినందనీయమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం ఎంజీఎం ఆసుపత్రిలోని పీడియాట్రిక్ విభాగానికి బిలియన్ హార్ట్స్ బ్రీతింగ్ ఫౌండేషన్, జనప్రియ సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద 60 లక్షల రూపాయల విలువ చేసే పీడియాట్రిక్ విభాగానికి అవసరమయ్యే ఎక్స్ రే, ఈ సీజీ మెషిన్, పారా మానిటర్లు, డబుల్ సర్ఫేస్ ఫోటో థెరపీ వంటి13 వివిధ రకాల పరికరాలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ తో పాటు పొరుగు రాష్ట్రాలైన చత్తీస్గడ్ మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ మహాత్మా గాంధీ ఆసుపత్రిలో సిఎస్ ఆర్ కింద దాతలు అందించిన పరికరాల వల్ల ఎన్ఐసీయూ, ఎస్ ఎన్సియు పీడియాట్రిక్ విభాగాలు బలోపేతమై చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందించుటకు తోడ్పడుతాయని అన్నారు. దాతలు ముందుకు వచ్చి మరింత ఉదారత వహించి ఆసుపత్రికి కావాల్సిన అవసరాలను కల్పించాలని కలెక్టర్ కోరారు.ఆసుపత్రి ద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలు అందించుటకు గత సంవత్సరం కాలం నుండి తరచుగా తనిఖీలు చేస్తూ ఆసుపత్రి బలోపేతం, మెరుగుదలకు కృషి చేయడం జరుగుతున్నదన్నారు. అనంతరం ఎంజిఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో దాతలకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిలియన్ హార్ట్స్ బ్రీతింగ్ ఫౌండేషన్ కంట్రీ హెడ్ సుధా జిజారియా, జనప్రియ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఎండి సతీష్ కుమార్, ఎంజీఎం పర్యవేక్షకులు కిషోర్, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబ శివరావు, ఆర్ఎంఓలు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీతోనే రాష్ట్రానికి రక్ష

**విశ్వాసంతో 'స్థానిక' ఎన్నికలకు ప్రజాప్రతినిధుల మీటింగ్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వల్ల రాష్ట్రం అప్పుల పాలు అవుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఇన్చార్జులు సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ హాజరయ్యారు. ఇందులో స్థానిక సంస్థల ఎన్నికలు, తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. పార్టీ పటిష్ఠానికి తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవగాహనతో ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు గ్యారంటీల గురించి ప్రజ లకు చెప్పాలని అన్నారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే బీజేపీ ప్రభుత్వం రావాలని స్పష్టం చేశారు. ప్రజలకు విశ్వాసం కల్పించి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. రాష్ట్రంలో కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే అభివృద్ధి కార్యక్రమాలు జరగవని స్పష్టం చేశారు. కేంద్రం సాయం తోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు విశ్వాసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లోకి వెళ్లాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేం దర్, గోడెం నగేశ్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్ బాబు, పైడి రాకేశ్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పాయల్ శంకర్ తదితరులు హాజరయ్యారు.

## పార్టీ లైన్ దాటితే చర్యలు..!

- ఏది పడితే అది మాట్లాడతారా?
- బీసీ అయితే చేసిన పాపాలు పోతాయా?
- కొండా మురళిని ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వార్నింగ్..!

**వేద న్యూస్, హన్మకొండ:**

రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి సుష్మిత పటేల్ బరిలో ఉంటుంది..వరంగల్‌లో కొంతమంది నాయకులు టీడీపీలో పదవులు అనుభవించి తర్వాత ఆ పార్టీని భ్రష్టు పట్టించారు..మళ్లీ బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్, కేటీఆర్‌లను తప్పుదోవ పట్టించి వారిని కూడా నాశనం చేశారు.. అందులో ఒకరు గతంలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అంటూ ఫైర్ అయ్యారు. పరకాలలో 75 ఏళ్ల నాయకుడొకరు నా దగ్గరికి వచ్చి కాళ్లు పట్టుకున్నారు.. అదే వ్యక్తి ఈ ఎన్నికల్లో గెలిపిస్తే వచ్చేసారి మీకు వదిలేస్తానని చెప్పారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గురువారం నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బర్త్ డే వేడుకల సందర్భంగా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాగా కొండా మురళి వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్



ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, బస్వరాజు సారయ్య, గుండు సుధారాణి హాజరయ్యారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ నాయకులు అనే ఇంగితం లేకుండా ఏది పడితే అది మాట్లాడతారా ?.. ఈ పాపాన్ని మోయలేము, దించేయండి అని అధిష్టానానికి కొండా దంపతులను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పార్టీ లైన్ దాటితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడి బీసీ కార్డు అడ్డుపెట్టుకుంటారా ? అని అడిగారు. బీసీ అయితే మీరు చేసిన పాపలు అన్ని పోతాయా ? అని కొండా మురళికి నాయిని రాజేందర్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. నోటకొచ్చినట్టు మాట్లాడితే పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో గొడవ పెట్టాలని చూస్తున్నారని.. ఇందులో తాడోపేడో తేల్చాల్సిందేనని అన్నారు. పార్టీకి నష్టం కలుగుతుంటే తమకు బాధ కలుగుతోందని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని, అందరం కలిసి అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.




## నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై పీడీ యాక్ట్

## భద్రకాళి అమ్మవారి బోనాలు తాత్కాలికంగా వాయిదా..!

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటన
- రాజకీయ విభేదాలను అమ్మవారికి ముడిపెట్టి ఇబ్బందులు సృష్టిస్తారనే నిర్ణయం..!

**వేద న్యూస్, హైదరాబాద్:**



ప్రతిష్టాత్మకంగా వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనా లు నిర్వహించేందుకు గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర దేవా దాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. అయితే, ఇటీవల భద్రకాళి బోనాలకి సంబంధించి కొంతమంది నుంచి అభ్యంతరాలు వెలువడిన నేపథ్యంలో, పలు మాధ్య మాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని అనుకున్నట్టు స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను... పవిత్రమైన అమ్మవారికి ముడిపెట్టి కొంతమంది ఉద్దేశపూరితంగా ఇబ్బందులు సృష్టిస్తారమో అని ఈ కార్యక్రమంలోకి అసాం ఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతో తాత్కాలికంగా బోనాలు నిర్వహణ రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

కాగా, భద్రకాళి అమ్మవారి టెంపుల్ పరిధిలో శాఖాహార బోనాలే ఉంటాయని స్థానిక ఈఓ, వేద పండితులు, ప్రభు త్వం పలుమార్లు పునర్ఘాటించారని అన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారమే, వేద పండితుల నిర్ణయం మేరకు భద్ర కాళి టెంపుల్‌లో నిర్వహించాలని అనుకున్నమాన్నా రు. అయితే, కొంతమంది మాంసాహారంతో బోనాలు నిర్వహి స్తున్నట్టు చెప్పడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్ళా యని చెప్పారు. రాజకీయాల కోసం భక్తుల మనస్సుల్లో తప్పుడు భావాలు నింపడం సహేతుకం కాదన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సురేఖ మీడియాకు ఒక ప్రక టన విడుదల చేశారు. 22వ తారీఖు భద్రకాళి అమ్మవారి టెంపుల్‌లో నిర్వహించాలన్న బోనాలను తాత్కాలికంగా రద్దు చేయాలని భావించినట్టు వివరించారు.

స్థానిక ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని... భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగొద్దని ఈ నిర్ణయం తీసుకున్నామని, భద్రకాళి అమ్మవారి బోనాల నిర్వహణపై సంప్రదింపులు జరిపిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా భక్తులకు తెలియజేయదలచినది %-% అమ్మవారి పట్ల నిష్కల్మషమైన భక్తి, సంప్రదాయాల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. కొంతమంది ప్రచారం చేసిన సమాచారం వల్ల ఏర్పడిన అపోహలకు తావులేదన్నారు.

భద్రకాళి అమ్మవారి విశిష్టతను పెంపొందించేందుకు, ప్రభుత్వం వేద పండితుల సలహా మేరకు, ప్రజాప్రతినిధుల సూచనల ఆధారంగా తగిన సమయంలో బోనాలను వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు.



## ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం ఫీజు రాయితీ

- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, డీఈఓ రాముకు కృతజ్ఞతలు తెలియజేసిన టీఎస్ జేయూ నాయకులు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీఎస్ జేయూ కోరుట్ల నియోజకవర్గ నాయకులు జిల్లా కలెక్టర్ నీ కోరగా తక్షణమే జిల్లా కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని కల్పించాలంటూ జగిత్యాల


మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

శనివారం, జూన్ 21, 2025

## ఘనంగా శ్రీ అగస్తేశ్వర స్వామి వారి అష్టమ వార్షిక కళ్యాణ మహోత్సవం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామములో కొలువైన శ్రీ ఆగస్తేశ్వర స్వామి వార్ల దేవాలయం నందు అష్టమ వార్షిక కళ్యాణ మహోత్సవ కార్యక్రమం భక్త జనసందోహం నడుమ అంగరంగా వైభవంగా అత్యంత ఆధ్యాత్మికంగా నల్గొండ జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఏంసి. కోటి రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు లు ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ సీజనులో వర్షాలు బాగా కురిసి పంటలు పండి నియోజకవర్గం అంతా సుభిక్షంగా ఉండేటట్టు చూడాలని స్వామి వార్లను కోరుకున్నారు. ఈ కార్యక్రమములో పిసికే ప్రసాద్, అంగోతు హాతీరాం నాయక్, పాదురీ సంజీవ రెడ్డి, కర్నాటి రమేష్, గౌరు శ్రీనివాస్, వెలిచేటి రామకృష్ణ, జెట్టి లింగయ్య, కొనకంచి శేఖర్ రావు, ఈశ్వర్ నాయక్, మాలావత్ రవీందర్ నాయక్, ధనావత్ శంకర్ నాయక్, సైదా నాయక్, కటికం సైదులు రెడ్డి, దొండ రామరాజు, తలకొప్పుల సైదులు, లింగంపల్లి రాములు, మాతంగి రాము, మెడ సురేందర్ రెడ్డి, యర్రయ్య, వీరయ్య, సాయన్న, షేక్ ఫయాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉత్తమ్,జానారెడ్డి, పొదిల శ్రీను ల పుట్టినరోజు వేడుకలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రజా బంధువు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ ల జన్మదిన సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు కేక్ కటింగ్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు జడ్పిటిసిలు, మాజీ కౌన్సిలర్స్, బ్లాక్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, గ్రామ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, ఐఎన్టియుసి నాయకులు, కిసాన్ సెల్, ఇంచార్జ్ లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు అండ..ఎర్రజెండా

**– సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

దామరచర్ల మండలం తొమ్మిదవ మండల మహాసభను మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ ఎమ్మెల్సీ నిల్లి కంటి సత్య హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సిపిఐ పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని వారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు సుదీర్ఘమైనటువంటి చరిత్ర కలిగినటువంటి పార్టీ, ఆర్థిక సమానత్వం కోసం ఒక మనిషిని ఒక మనిషి దోపిడీ చేయాలనే వ్యవస్థనుండి, సమ సమాజం స్థాపన కోసం సిపిఐ పార్టీ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తూ సిపిఐ పార్టీ ముందు సాగుతుందని అన్నారు. ఈ 100 సంవత్సరాల కాలంలో సిపిఐ పార్టీ చేసిన త్యాగాలు ప్రజల్లోకి తీసుకుపోయి ప్రజలను చైతన్యవంతం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేకాల మీద ప్రజలను సమీకరణ చేసి పోరాటాలు చేస్తామని వెల్లడించారు. ఈ భారతదేశంలో అసమానతలు పోవాలంటే దోపిడి పోవాలంటే, మన అసమానతలు లేని వ్యవస్థ రావాలంటే, అది కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమని వారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో పేదవాళ్లకు 10 లక్షల ఎకరాలు పంచిన ఘన చరిత్ర ఉందని, కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల సరుకుల అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఈ దేశంలో ఉన్న సంపదను కట్టబెట్టి చెందకు ప్రయత్నాలు కొనసాగిస్తుందని వారు ఆరోపించారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు పరచాలని, భూభారతిలో గిరిజనులు పెట్టుకున్నటువంటి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి తాతల తండ్రులను దగ్గర నుండి భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వారికి బేషరతుగా పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఫ్యాక్టరీలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, యాదాద్రి పవర్ ప్లాంట్ లో భూమి కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారన్నారు. ఈ మహాసభలో ఎఐటిసి జిల్లాఉపాధ్యక్షులు ఎండి సయ్యద్, దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగనాయక్, మిర్యాలగూడ మండల కార్యదర్శి అంజన్న పెల్లి రామలింగం, వేములపల్లి మండల కార్యదర్శి జిల్లాయాదగిరి, దామరచర్ల మండల సహాయ కార్యదర్శి డి శాంతి, పోలేపల్లి ఉదయ్. కల్లెపల్లి పాఠశాల చైర్మన్ బుజ్జిలింగ నాయక్, మహిళా సమైక్య నాయకులు పోలిపల్లిమమత, లక్ష్మయ్య, రవి, అన్నపూర్ణ, నిర్మల, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ కనిపించడం లేదు... బాలకృష్ణది గెలుపే కాదు

- – కూటమి నాయకుల గెలుపు మాయ అని వ్యాఖ్య
- – హిందూపురం అభివృద్ధిని బాలకృష్ణ పట్టించుకోవడం లేదని విమర్శ
- – ప్రముఖ యాంకర్ శ్యామల



**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. వైసీపీ అధికార ప్రతినిధి, ప్రముఖ యాంకర్ శ్యామల తాజాగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పవన్ కల్యాణ్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, బాలకృష్ణ తన నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న శ్యామల, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీరుపై తన నిరసనను వినూత్నంగా తెలిపారు. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారు ఎక్కడైనా కనిపించారా?" అని రాసి ఉన్న ప్లకార్డును ఆమె ప్రదర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అంశాలపై గళమెత్తిన పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మధ్యకు రావడం లేదని శ్యామల విమర్శించారు. ఆయన ఎక్కడున్నారో చెప్పాలంటూ నిలదీశారు. ఈ వ్యాఖ్యలు, ప్లకార్డు ప్రదర్శన ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. బాలకృష్ణపైనా శ్యామల ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రంలో కూటమి నాయకులది గెలుపు కానే కాదు.. అదంతా మాయ" అని ఆమె అన్నారు. హిందూపురంలోని ఒక పోలింగ్ కేంద్రంలో వైసీపీకి కేవలం ఒక్క ఓటు మాత్రమే రావడం బాలకృష్ణ గెలుపు ఎంత కృత్రిమమో తెలియజేస్తోందని ఆమె ఆరోపించారు. "బాలకృష్ణది అసలు గెలుపే కాదు" అని శ్యామల స్పష్టం చేశారు.

# భూమన ఆరోపణలపై స్పందించిన టీటీడీ

**వేద న్యూస్, డెస్క్:**

తిరుమల తిరుపతి దేవస్థానంపై వైఎస్సార్ సీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై టీటీడీ బోర్డు స్పందించింది. టీటీడీపై భూమన ఆరోపణలు అవాస్తవాలు, అభూత కల్పనలే అని స్పష్టం చేసింది. భూమన నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా టీటీడీ మీద బురద జల్లడం శోచనీయమంటూ మండిపడింది. టీటీడీ బోర్డు ఇంకా ఏమందంటే.. 'శ్రీవారి ఆలయంలో తరతరాలుగా వస్తున్న వేద పారాయణానికి తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోందని.. వేద పారాయణ చేసే వారితో అవహేళనగా మాట్లాడారనటం పూర్తిగా అవాస్తవం. తిరుమలలోని అన్ని ముఖ్య ప్రాంతాలతో పాటు కాలిబాట మార్గాల్లో కూడా ఓం నమో వేంకటేశాయ నామాన్ని ప్రతిధ్వనించేలా ఏర్పాటు చేశాం. వేద పాఠశాలల్లో వేద విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వం పెంచే విధంగా కూడా చర్యలు చేపడుతున్నాం. శ్రీవారి ఆలయంలో విధులు నిర్వర్తించే అర్చకులను తనిఖీ చేయడమన్నది పూర్తిగా వాస్తవ దూరం. అర్చకులకు ఇచ్చే గౌరవంలో ఎలాంటి లోటుపాట్లు లేవు. ఆలయం లోపల ఇటీవల కాలంలో అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగింది. శ్రీవారి దర్శనాలు, తీర్థ ప్రసాదాలు, తదితర అంశాలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ విధానాన్ని ప్రారంభించి పారదర్శకతకు పెద్దపీట వేశాం. టీటీడీ కేటాయించిన స్థలానికన్నా ఎక్కువ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టినందుకు కోర్టు ఆదేశాలు ప్రకారం విశాఖ శారదా పీఠం, మరో రెండు మఠాలకు నోటీసులు జారీ చేశాం. ఏఐ టెక్నాలజీతో దర్శనం చేయిస్తామని చెప్పి.. భక్తులను అడ్డుకుంటున్నారని అవాస్తవాలు పలికే ముందు నిజాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషించి భక్తుల సౌకర్యార్థం శాస్త్రీయ పద్ధతిలో సమయ పాలన పాటిస్తూ.. క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహిస్తూ వస్తున్నాం. ఎక్కువ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టినందుకు కోర్టు ఆదేశాలు ప్రకారం విశాఖ శారదా పీఠం, మరో రెండు మఠాలకు నోటీసులు జారీ చేశాం. ఏఐ టెక్నాలజీతో దర్శనం చేయిస్తామని చెప్పి.. బయట క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు 22 ఫుడ్ కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేసి శ్రీవారి సేవకుల ద్వారా అన్నపానీయాలను అందిస్తున్నాం. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వారాంతాల్లో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాలను అందిస్తున్నాం. ఏఐ ప్రాజెక్టు సాకారం కావడానికి టీటీడీ అన్ని చర్యలు తీసుకుంటోంది.

# యోగాంధ్ర ఏర్పాట్లు మామూలుగా లేవు

- – విశాఖలో జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- – హాజరుకానున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- – సాగర తీరంలో 5 లక్షల మందితో యోగాసనాలు, ప్రపంచ రికార్డు లక్ష్యం
- – ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 34 కిలోమీటర్ల మేర కార్యక్రమం
- – రూ.62 కోట్ల వ్యయంతో ఏర్పాట్లు, పటిష్ట భద్రతా చర్యలు



**వేద న్యూస్, డెస్క్:**

విశాఖపట్నం :అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగాంధ్ర 2025" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. జూన్ 21వ తేదీన (శనివారం) విశాఖ సాగర తీరంలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా యోగాసనాలు వేయనున్నారు. సుమారు 5 లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, తద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

– సాగర తీరం వెంబడి అపూర్వ ఘట్టం

ఈ మెగా ఈవెంట్ కోసం విశాఖ ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వరకు సుమారు 34 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని యోగా వేదికగా తీర్చిదిద్దారు. బీచ్ రోడ్డులో మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ప్రతి 40 అడుగులకు ఒక చిన్న వేదికను నిర్మించారు. ఈ ఏర్పాట్ల దృష్ట్యా, శుక్రవారం (జూన్ 20) నుంచే బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి ముందుగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు. ప్రతిఒక్కరికీ ఉచితంగా యోగా మ్యాట్, టీ షర్టులు అందజేస్తారు.

– రూ.62 కోట్లతో విస్తృత ఏర్పాట్లు

సుమారు 62 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాల్గొనేవారి సౌకర్యార్థం 3 వేల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఐదు కంపార్ట్‌మెంట్‌లకు ఒక వైద్య శిబిరాన్ని, ప్రధాన వేదిక వద్ద పది పడకల తాత్కాలిక ఆసుపత్రిని సిద్ధం చేశారు. ప్రజల తరలింపు కోసం 3,600 ఆర్టీసీ బస్సులతో పాటు 7,295 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు.

ఒకవేళ శనివారం వర్షం కురిస్తే, కార్యక్రమానికి అంతరాయం కలగకుండా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మైదానంలో సుమారు 20 వేల మంది గిరిజన విద్యార్థులతో ప్రత్యేక యోగా కార్యక్రమం కూడా జరగనుంది. ఇక్కడ కూడా పది పడకల ఆసుపత్రిని నిర్మించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖలో కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 10 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, బీచ్ రోడ్డు వెంబడి 2 వేల సీసీ కెమెరాలను అమర్చారు. కార్యక్రమ పర్యవేక్షణకు 26 మంది ప్రముఖ యోగా గురువులు, 1500 మంది శిక్షకులు, 6300 మంది వాలంటీర్లు సేవలందించనున్నారు. తూర్పు నౌకాదళం కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటోందిబీ వారి ఆధ్వర్యంలో 11 యుద్ధ నౌకలపై యోగా సాధన చేయనున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్ కోసం ఐఎన్ఎస్ డేగ నుంచి కమాండ్ గెస్ట్ హౌస్ వరకు పోలీసులు ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గిన్నిస్ రికార్డు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర మంత్రి నారాయణ తెలిపారు.

# ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

**వేద న్యూస్, డెస్క్:**

అమరావతి : ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విడుదల చేశారు. గణితం, భౌతిక శాస్త్రాలు, సామాజిక అధ్యయనాలు, జీవశాస్త్రం, ఇంగ్లీష్ ఇలా మొత్తం ఐదు విభాగాల్లో 99.42 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొత్తం 17,795 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 14,527 మంది అర్హత సాధించారని మంత్రి వెల్లడించారు. ర్యాంక్ కార్డులను వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును తెలుసుకోవచ్చు. అలాగే మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను పొందే అవకాశాన్ని కల్పించింది సర్కార్. ముందుగా ఏపీ వాట్సప్ నంబర్‌కు హాయ్ మెసేజ్ చేయాలి.. తరువాత సెలక్ట్ సర్వీస్‌లో విద్యాసేవలు ఆప్షన్‌ను ఎన్నుకోవాలి. అందులో ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలపై క్లిక్ చేసి.. హాల్ టికెట్ నెంబర్, రిజిస్ట్రేషన్ నెంబర్‌ను ఎంటర్ చేసిన వెంటనే ఫలితాలు, ర్యాంక్ కార్డు వచ్చేస్తుంది.



# సంపాదకీయం

## అధికార యంత్రాంగంలో అవినీతిపై ఉక్కు పాదం మోపాలంటే ప్రజా పాలకులు కావాలి

విద్యా వైద్యం సామాజిక న్యాయం ప్రజల మౌలిక సమస్యలు వ్యవసాయ రంగానికి సంబంధించినటువంటి రైతుల ఇబ్బందులు మొత్తం పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వాలదె. అన్ని అవకాశాలు ఉన్నప్పుడు ప్రజలు అవినీతిని ప్రోత్సహించరు అవినీతి సహించరు కూడా. ఆయా వ్యవస్థలు సక్రమంగా పనిచేయని కారణంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కూలీలు రైతులు సామాన్య వర్గాలు కార్యాలయాలకు పోయినప్పుడు వేలు లక్షల నుండి కోట్ల వరకు డిమాండ్ చేసిన సందర్భం మనదేశంలో చూడవచ్చు. ఒక్క రాష్ట్రమని కాదు అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది మామూలు చిరు ఉద్యోగి కూడా కోట్ల రూపాయలను దండుకున్నట్లు పత్రికా ప్రకటనలు వస్తూ ఉంటే ఇక ఉన్నత స్థాయి అధికారి ఎన్ని వేల కోట్లు సంపాదించవచ్చో అర్థం చేసుకోవచ్చు. ఇదేనా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించినటువంటి భారత ప్రజాస్వామ్యం? ప్రజల మౌలిక హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగాన్ని రాసింది ఇందుకేనా? ఒక్కసారి ప్రజలంతా ఆలోచించాలి. 2025 మే మాసంలో ఈనాడు లో వచ్చిన సంపాదకీయాన్ని ( అవినీతి విష వలయం) పరిశీలించినట్లయితే భయంకరమైన అవినీతికి సంబంధించిన కొన్ని విషయాలు మన గుండె ఆగిపోయేంత పని చేస్తాయి. తిరుపతి జిల్లాలో ఒక గ్రామ పంచాయతీ కార్యదర్శి 30 కోట్ల ఆస్తిపాస్తులను కూడా పెట్టినాడంటే అత్యున్నత స్థాయి అధికారి ఎన్ని వేల కోట్లు సంపాదించవచ్చు అర్థం చేసుకోవాలి. నకిలీ వైద్యులను కటకటాల్లోకి పంపకుండా ఉండడానికి 16 లక్షలకు బేరం కుదుర్చుకున్నారట సూర్యాపేటకు చెందిన ఇద్దరు ఉన్నత అధికారులు. ఒడిస్సా గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజనీర్ పైన అనుమానంతో సోదా కోసం అధికారులు వెళ్తే 37 లక్షల అక్రమ సొమ్మును అతడు కిటికీలోంచి బయటికి విసిరి వేసిన సంఘటన చూసి ఆశ్చర్యపోయారు. అవినీతి నిరోధక శాఖ వైఫల్యానికి ఈ కొన్ని సంఘటనలు తాజా ఉదాహరణ మాత్రమే. చిత్తూరు జిల్లాలో ఓ సామాన్య పేద రైతు తన భూమి తన పేరు మీద రికార్డుల్లో లేదని సవరించమని కోరినందుకు చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ఇన్చార్జి తాసిల్దార్ ఆ రైతును ఒకటిన్నర లక్షల రూపాయలు డిమాండ్ చేశారంటే వాళ్ల నిత్య జీవితం ఏ రకమైన కార్యకలాపాలతో కొనసాగుతున్నది అర్థం చేసుకోవచ్చు. కాలేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇద్దరు అధికారులు 100 కోట్ల రూపాయల చొప్పున అక్రమాస్తులను పోగు చేసుకున్నట్లు ఇటీవల వెలుగు చూసిన విషయాన్ని కూడా ఈ పత్రిక ప్రస్తావించింది. నీతికి వ్యతిరేకమైనదంతా అవినీతి అందులో ప్రధానంగా ప్రజల సొమ్మును అప్పనంగా కూడా పెట్టుకుని పేదలను మరీ పేదరిక పేదరికంలోకి నెట్టు వేయడం ఆరోగ్యకరమైన భారతావనికి శ్రేయస్కరం కాదు. రాజ్యాంగపరంగా సంక్రమించిన అవకాశాలు హక్కులను సామాన్య ప్రజానీకానికి అందకుండా ఆటంకపరుస్తున్న అక్రమ దుష్ట శక్తులు ఈ అవినీతిపరులైన ఉద్యోగులను నిలువరించక లేక పోతున్నాం అంటే ఎవరి వైఫల్యం? మనం నిదానంగా ఆలోచించాలి పరిష్కారాలను వెతకాలి. ఇది కేవలం బాధితుల సమస్య మాత్రమే కాదు. నోరుండి మూగవాళ్లు అయిన బుద్ధి జీవులు మేధావులు ఆలోచన పరులు అందరి ముందున్నటువంటి కఠోరమైన సవాల్గా స్వీకరించాల్సిన అవసరం ఉంది. ఇవి ఒకటి రెండు ఉదాహరణలు మాత్రమే గతంలో తెలంగాణ రాష్ట్రంలో ఒక జిల్లా అధికారి కోటి రూపాయలను డిమాండ్ చేసిన విషయం కూడా పత్రికల్లో చూసి ఉన్నాము. అంతేకాదు ఉద్యోగులచే పీడించబడినటువంటి రైతులు విధి లేని పరిస్థితిలో పెట్రోల్ పోసి తగలబెట్టిన విషయం కూడా మనకు తెలుసు. అయినా దొంగల బుద్ధి మారడం లేదంటే అంతకుమించిన సిగ్గుమాలిన చేష్ట మరొకటి ఉంటుందా?అక్రమార్కులైన ఉద్యోగుల యొక్క ఈ రకమైన లంచాల దోపిడీ కారణంగా దేశ ప్రజలు ఏడాదికి సుమారు 21 వేల కోట్ల సంపదను కోల్పోతున్నారని కొన్ని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదకు చెందిన వనరులఆ క్రమార్జనకు జరుగుతున్న చీకటి ఒప్పంధాల వల్ల దేశం ఏటా మరో లక్ష కోట్లు నష్టపోతున్నట్లు అంచనాలున్నాయి. ఈ లెక్కలు పదేళ్ళాకిందటివి ప్రస్తుతం అంచనా రెట్టింపు కావచ్చు కూడా. అక్రమార్కుల చెర లోకి చేరుతున్న ప్రజాదనాన్ని అంచనా వేయలేని ఈ దుస్థితిలో సామాజిక న్యాయ సాధనకు ఆటంకామౌతున్న ఈ అవినీతిని అడ్డుకోవాలంటే కఠినంగా వ్యవహారించాలని సర్వోన్నతన్యాయస్థానం గతంలో హెచ్చరించినప్పటికి ప్రయోజనం శూన్యం. చిత్తశుద్ధి లేని పాలకుల పుణ్యం ప్రధాన కారణం. ఉద్యోగ యంత్రాంగంలో నిర్మోలించడానికి రాజకీయ అవినీతి అవరోధం కావడం లేదా? 2019ఎన్నికల్లో అన్నిపార్టీల ఖర్చు 50000కోట్లు 2024లో రెట్టింపు కావచ్చు కూడా. పదోన్నతి పొందడానికి అక్రమప్రయోనాలకు అధికారగణంతో దాగూడూమూతలు కూడా ఈ అవినీతి జడలువిప్పడానికి కారణమౌతున్నది. అవినీతి నిరోధక శాఖలు, సిబిఐ, ఈడి, ఇతర విచారణ సంస్థలు, న్యాయ వ్యవస్థలు ఉండగా కూడా ఇంత అవినీతి జరుగుతున్నదంటే నవ్వాలో ఏడవాలో అర్థం కాని దీనస్థితి. బలమైన ప్రజా చట్టాలు, న్యాయవ్యవస్థ జోక్యం, ప్రజాఉ ద్యమాల ధ్వారా ఈ గడ్డు పరిస్థితికి భారతదేశంలో ఎంత తొందరగా వీలైతే అంత తొందరలో చెక్ పెట్టినప్పుడు మాత్రమే కనీస మానవాభివృద్ధిని చూడగలము. లేకుంటే అసమానతలు అంతరాలు భూమ్యాకాశాలకు ఉన్నంత స్థాయిలో పెరిగే ప్రమాదం ఉంది.విచారణ శిక్షలతో పాటు రాజకీయ సంకల్పం కీలకం కావాలి.

# ఆటవిక పాలన నుంచి అభివృద్ధికి బాటలు వేశాం

**వేద న్యూస్, డెస్క్:**



బీహార్ను ఆటవిక రాజ్యంలోని నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్లోని సివాన్లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్ధిదారులకు తొలి విడత ఇన్స్టాల్మెంట్గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్లో తయారైన లోకోమోటివ్ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విమానాన్ని ఢీకొట్టిన పక్షి

**- కొద్ది వారాల్లో 15 శాతం అంతర్జాతీయ సర్వాసులను తగ్గించాలని నిర్ణయం**

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ఎయిర్ ఇండియా విమానాలు వరుస కష్టాలను ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. ఢిల్లీ నుంచి పుణెకు శుక్రవారం ఉదయం బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానాన్ని పక్షి ఢీకొట్టడంతో తిరుగు ప్రయాణాన్ని రద్దు చేశారు. విమానం సురక్షితంగా పుణెలో ల్యాండ్ అయిందని, సేఫ్టీ చెక్లో విమానాన్ని పక్షి ఢీకొట్టినట్టు గుర్తించామని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిరిండియా విమానం వెంటనే ఢిల్లీకి తిరిగి వెళ్లాల్సి ఉందని, అయితే పక్షి ఢీకొట్టడంతో రిటర్న్ ఫ్లైట్ను రద్దు చేశామని తెలిపింది. ప్రయాణికులకు బోర్డింగ్ , రీఫండ్ ఏర్పాట్లు చేసినట్టు తెలిపింది. ప్రత్యామ్నాయ ఫ్లైట్ను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. కాగా, పలు అంతర్జాతీయ విమాన సర్వీసులతోపాటు దేశంలో నడిచే వివిధ విమాన సర్వీసులను సైతం రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా శుక్రవారంనాడు ప్రకటించింది. విమాన సర్వీసుల భద్రత తనిఖీలు, వాతవరణ పరిస్థితులు, ఆకాశ మార్గంలో విధించిన నిబంధనలు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాబోయే కొద్ది వారాల్లో 15 శాతం అంతర్జాతీయ సర్వాసులను తగ్గించాలని నిర్ణయించినట్టు చెప్పింది. జూన్ 20 నుంచి జూలై ప్రథమార్థం వరకూ ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది.

# మెడికోల కుటుంబాలకు భారీ విరాళం!



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

గుజరాత్లోని అహ్మదాబాద్లో ఈ నెల 12న ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. 242 మందితో అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం ఎయిర్ పోర్ట్ నుంచి టేకాఫ్ అయిన నిమిషం లోపే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ బిల్డింగ్పై కూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో 241 మంది మృతి చెందగా.. హాస్టల్లోని వైద్య విద్యార్థులు, వైద్యులు కూడా మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడిన వైద్యుల కుటుంబాలకు యూఏఈకి చెందిన ఓ వైద్యుడు భారీ విరాళం ప్రకటించారు. డాక్టర్ షంషీర్ వాయలిల్ మెడికల్ కాలేజీలో విమాన ప్రమాద సమయంలో మరణించిన నలుగురు వైద్య విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి చొప్పున అలాగే గాయపడిని వారికి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.6 కోట్ల భారీ విరాళం ప్రకటించారు. బుర్జీల్ హోల్డింగ్స్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్,హెల్త్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన డాక్టర్ షంషీర్.. ప్రమాద దృశ్యాలు తన మనసును కలచివేశాయని అన్నారు. మంగళూరులోని కస్తూర్బా మెడికల్ కాలేజీ, చెన్నైలోని శ్రీ రామచంద్ర మెడికల్ కాలేజీలో తన వైద్య విద్య సమయంలో ఇలాంటి హాస్టళ్లలో నివసించిన వ్యక్తిగా.. చిత్రాలు తన హృదయాన్ని కలచివేసినట్లు తెలిపారు. ప్రమాదం తర్వాత హాస్టల్ ఫుటేజ్ చూసిన తర్వాత ఇల్లులా భావించే హాస్టల్ ప్రదేశాలు, కారిడార్లు, పడకలు, నవ్వులు, పరీక్షల ఒత్తిడి, కుటుంబం నుండి పిలుపు కోసం ఎదురుచూడటం నాకు గుర్తు చేసిందంటూ తన విద్యార్థి దశను గుర్తు తెచ్చుకున్నారు. అయితే డాక్టర్ షంషీర్ ఇప్పుడే కాదు 2010 మంగళూరు విమాన ప్రమాద సమయంలో కూడా ఆర్థిక సాయం అందించారు. కాగా అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వైద్య విద్యార్థుల వివరాలు చూస్తూ.. రాజస్థాన్లోని బార్మర్కు చెందిన జయప్రకాష్ చౌదరి, రాజస్థాన్లోని శ్రీ గంగానగర్కు చెందిన మానవ్ భాదు, మధ్యప్రదేశ్లోని గ్వాలియర్కు చెందిన ఆర్యన్ రాజ్పుత్, గుజరాత్లోని భావ్నగర్కు చెందిన రాకేష్ దియోరా ఉన్నారు.

# నిజం ఒప్పుకున్న పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి

**వేద న్యూస్, డెస్క్:**



భారతదేశం తర్వాత, ఇప్పుడు పాకిస్తాన్ కూడా రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ తీసుకురావడంలో అమెరికా పాత్రను ఖండించింది. పాకిస్తాన్ అభ్యర్థన మేరకు సౌదీ అరేబియా కాల్పుల విరమణ కోసం భారతదేశంతో మాట్లాడిందని పేర్కొంది. పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఒక పాకిస్తాన్ వార్తా ఛానెల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన విషయాలు బయటపెట్టారు. పాకిస్తాన్లోని రెండు ప్రధాన వైమానిక స్థావరాలు, నూర్ ఖాన్ మరియు షోర్కోట్లపై భారతదేశం దాడి చేసిందని ఇషాక్ దార్ ఇంటర్వ్యూలో అంగీకరించాడు. మే 6-7 తేదీల మధ్య రాత్రి, పాకిస్తాన్ ఎదురుదాడికి సిద్ధమవుతున్నప్పుడు, భారతదేశం వైమానిక దాడి చేసి నూర్ ఖాన్-షోర్కోట్ వైమానిక స్థావరాన్ని దెబ్బతీసిందని ఆయన వెల్లడించారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ తీసుకురావడంలో సౌదీ అరేబియా చొరవను ఇషాక్ దార్ అంగీకరించారు. భారత దాడుల తర్వాత, సౌదీ అరేబియా యువరాజు భారతదేశంతో ఫోన్లో మాట్లాడాలని ప్రతిపాదించారని, ఆపై పాకిస్తాన్ సమ్మతి తర్వాత, సౌదీ అరేబియా భారతదేశంతో మాట్లాడిందని ఆయన అన్నారు. ‘భారత దాడుల తర్వాత దాదాపు 45 నిమిషాల తర్వాత, సౌదీ అరేబియా యువరాజు ఫైసల్ ఫోన్లో మాట్లాడారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్తో మాట్లాడాలా అని యువరాజు అడిగారు. పాకిస్తాన్ ఆపడానికి సిద్ధంగా ఉంటే, భారతదేశం కూడా ఆపవచ్చు. దీనికి అవును అని చెప్పాను. కొంత సమయం తర్వాత యువరాజు మళ్ళీ ఫోన్ చేసి జైశంకర్తో అన్నీ చెప్పానని చెప్పాడు’ అని ఇషాక్ దార్ అన్నారు. ఇషాక్ దార్ వాదనతో, భారత్-పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను శాంతింపజేయడంలో సౌదీ అరేబియా ముఖ్యమైన పాత్ర పోషించిందని ఇప్పుడు స్పష్టమైంది.

# వేదికపై కంటతడి పెట్టిన రాష్ట్రపతి

**వేద న్యూస్, డెస్క్:**



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేదికపైనే భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. రాష్ట్రపతి 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్ము భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఉత్తరాఖండ్లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యారని చెప్పారు. ‘కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట” అని అన్నారు. పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల గురయ్యారని చెప్పారు. ‘కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట” అని అన్నారు.

పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు.

వేద న్యూస్

శనివారం జూన్ 21, 2025




# సేవే లక్ష్యం



- హుజూరాబాద్ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం
- సమస్యల పరిష్కారానికి కృషితోనే ప్రజల్లో విశ్వాసం
- ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్

**వేద న్యూస్, హుజూరాబాద్:**

తేదీ.. జూలై 15, 2024.. సమయం.. సుమారు అర్ధరాత్రి 12 గంటలు దాటిన ప్రాంతంలో హుజూరాబాద్ పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తా సమీపాన చిరువ్యాపారులకు చెందిన ఫ్రూట్స్, మెకానిక్, చెప్పుల ఇతర వివిధ రకాల షాపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ సంగతి తెలిసిన వెంటనే మరుక్షణమే బాధిత కుటుంబాలకు సిర్సపల్లివాసి, ప్రముఖ సామాజికవేత్త, మల్టీ నేషనల్ కంపెనీ 'జెన్‌ప్యాక్ట్' గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ తక్షణ సాయం ప్రకటించారు. వ్యక్తిగత హెూదాలో సాయం మరునాడు అందజేసి.. తన సేవాదృక్పథాన్ని, సేవా గుణాన్ని చాటుకున్నారు. అనంతర కాలంలో హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో సమస్యలపై గళమెత్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరతపై, అసెంబ్లీ సెగ్మెంట్ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో తన వంతుగా శక్తి మేరకు పనులు చేస్తున్నారు. ఇక ఆయన పుట్టిన రోజు (జూన్ 21) వచ్చిందంటే చాలు సబ్బని అనుచరులు.. అట్టహాసంగా రక్తదాన వైద్య శిబిరాలు నిర్వహించేవారు. గత 2-3 సంవత్సరాలుగా వెంకట్ బర్త్ డే సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా.. ఆయన హెూర్డింగ్స్, వాల్ పోస్టర్స్‌తో అసెంబ్లీ సెగ్మెంట్ నిండిపోయేది. కానీ, ఈ ఏడాది నిరాడంబరంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా ఉన్నారు. అందుకు గల కారణంతో పాటు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ బరిలో నిలవకపోవడానికి గల రీజన్, నియోజకవర్గ పరిధిలోని సమస్యల గురించి సబ్బని వెంకట్.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### బర్త్ డే సందర్భంగా ప్రోగ్రామ్స్ చేపట్టపోవడానికి రీజన్ ఇదే..

గతేడాది కూడా నా పుట్టిన రోజున కార్యక్రమాలు చేయలేదు. ఒకే చోట వందల బ్లడ్ యూనిట్స్ సేకరించి రెడ్ క్రాస్ వాళ్లకు ఇవ్వడం ద్వారా, అది వారి ఆధీనంలో చాలా నియమ నిబంధనలతో అవసరమైన వారికి అందజేస్తారు. దానికి బదులుగా ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తికి ఎలాంటి శ్రమ లేకుండా రక్తం అందిస్తే బాగుంటుందనే ఆలోచనతో వాట్సాప్ ద్వారా ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా గ్రూప్స్ క్రియేట్ చేసి సేవలందిస్తున్నాం. ఈ సంవత్సరం నా నిర్ణయం మేరకు, నా తమ్ముళ్లు, అనుచరులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించట్లేదు. కారణం నేను నా టీం పహెల్గాం తీవ్రవాద దాడికి నిరసనగా హుజురాబాద్ నియోజకవర్గంలో బాధిత కుటుంబాలకు మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ తీయాలి అనుకున్నాం. కానీ, ఉద్యోగరీత్యా నేను అందుబాటులో లేను. ఆ కార్యక్రమం నిర్వహించని నేను, ఒక నాయకుడిగా జవాబుదారీతనంతో దాడికి నిరసనగా, బాధ్యతగా హెూర్డింగ్స్, వేరే ఇతర ఆడంబరాలకు తావు ఇవ్వద్దని నేనే నా అనుచరులకు చెప్పాను.

### ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో బరిలో నిలవకపోవడానికి రీజన్ ఇదే..

అది అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం, బాధితులకు అండగా నిలవాలని నిర్ణయించుకుని సాటి మనిషిగా స్పందించాను., సహాయం చేస్తాను అని మాట ఇచ్చాను. ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన సమయానికి వచ్చి చేశాను. క్రీడల నిర్వాహకులు నా నుంచి సహాయం ఆశించారు నేను సహాయం చేశాను, దానితో వారు గౌరవంగా నాకు అతిథి హెూదా ఇచ్చారు ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి వారికి కష్టం, అవసరం వస్తే తోడుగా నిలబడ్డాను. ఇక రాజకీయ అరంగేట్రానికి నేను చేసే సేవ కార్యక్రమాలకు సంబంధం లేదు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను పోటీ చేయాలని అనుకోలేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ 40 నియోజకవర్గాల పరిధిలోని నిరుద్యోగుల సమస్యలు, ఉపాధి అవకాశాల మీద, ప్రభుత్వంతో సమన్వయంతో కూడుకున్న అతిపెద్ద బాధ్యత కాబట్టి అవకాశం వచ్చినా కూడా.. నా దృష్టి అంత హుజురాబాద్ నియోజవర్గ అభివృద్ధి మీద ఉంది కాబట్టి పోటీ నుండి తప్పుకోవాల్సి వచ్చింది.

### 'స్థానిక' ఎన్నికల్లో వారికి నా మద్దతు..

ప్రస్తుతానికి నేను ఏ రాజకీయ పార్టీలో లేను. కాబట్టి ఫలానా పార్టీకి నా మద్దతు ఇస్తాను అని చెప్పలేను. కానీ, అన్ని పార్టీల్లో నా మద్దతుదారులు, శ్రేయోభిలాషులు ఉన్నారు. వాళ్లందరికీ టికెట్ తెచ్చుకునే సత్తా, గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పార్టీలు ఏవైనా వారికి వ్యక్తిగతంగా మంచిపేరుతో పాటు ప్రజా సేవలో ఉన్నారు. అలాంటి వారికి నా మద్దతు ఖచ్చితంగా ఉంటుంది. వారు గెలుస్తారు కూడా! వారంతా భవిష్యత్‌లో నాతో పాటు హుజురాబాద్ అభివృద్ధిలో భాగస్వాములవుతారు.

### జనానికి అందుబాటులో ఉన్న వాళ్లే నాయకులు..

ఇప్పుడు నియోజకవర్గంలో ఎల్‌వోసీలు ఇచ్చే వారందరూ ఎమ్మెల్యే స్థానంలో ఉన్న వ్యక్తులేనా? ఆపదలో ఉండి సహాయం కోరే వారు, వారికి పరిచయం ఉన్న వారి ద్వారా నన్ను చేరుకున్నప్పుడు వారి అత్యవసర పరిస్థితి దృష్ట్యా సహాయం చేస్తున్నాను. అంతేకానీ వేరే వారి స్థానం భర్తీ చేయాలని కాదు. ఎల్‌వోసీలు ఇచ్చిన్నంత మాత్రాన అసెంబ్లీలో అడుగు పెట్టలేను కదా! నాయకుడు అనే వాడు నమ్మి ఓటు వేసిన ప్రజలకు అందుబాటులో ఉండి.. సమస్యల మీద ఫోకస్ పెడితే ఆ నాయకుడి మీదనే ప్రజలు విశ్వాసం చూపుతారు. అప్పుడు నా దగ్గరకు రారు.

### డంపింగ్ యార్డు ఇష్యూపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు నడుచుకుంటామని అధికారంలోకి వచ్చింది. ఇక్కడ సమస్యలు సర్కారు దృష్టికి తీసుకెళ్లాల్సింది ఎవరు? అధికార పార్టీ నాయకులు, ఇప్పుడున్న ఎమ్మెల్యే. వారు సీఎం దృష్టికి తీసుకెళ్తేనే కదా సమస్య పరిష్కారం అవుతుంది. డంపింగ్ యార్డ్ స్థాపన నిర్ణయం జరిగిపోయింది. వేరే నియోజవర్గంలో పెట్టవలసినది, అక్కడ నేతల ప్రోద్బలంతో అక్కడ నుండి తరలి ఇక్కడికి వచ్చింది. కారణం అక్కడ బలమైన రాజకీయ నాయకత్వం ఉంది. ఇక్కడ లేదు! ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఈ సమస్య మీద అఖిలపక్షం ఏర్పాటు చేస్తే నేను తప్పకుండ పాల్గొంటాను లేదా నిరాహార దీక్ష ,ఉద్యమం చేద్దాం అంటే నేను తప్పకుండా నా మద్దతు తెలుపుతాను. నాతో పాటు కొన్ని వందల మందిని తీసుకుని వచ్చి శిబిరంలో కూర్చుంటాను.

### త్వరలో జమ్మికుంటలో ఉద్యోగ మేళా నిర్వహిస్తా..

ఏప్రిల్ నెలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా నిర్వహించలేకపోయాం. జూన్ నెలలో నిర్వహిద్దాం అని ప్రణాళికలు రూపొందించుకున్నాం. కానీ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం, ఐటీ పరిశ్రమలో నెలకొన్న స్తబ్ధత కారణంగా ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గాయి. కొన్ని కంపెనీలు వారి ఆదాయం తగ్గడం వ్యాపారం లేకపోవడం వల్ల వివిధ కంపెనీలో అనుకున్న సంఖ్యలో టెక్నికల్ రోల్స్ అందుబాలులో లేవు. అందుచేత కొంత ఆలస్యం అవుతుంది. కానీ ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా త్వరలోనే జాబ్ మేళా నిర్వహిస్తాం.



## బాల్య మిత్రుని కుటుంబానికి చేయూత

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**


బాల్యంలో తమతో కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి అండగా నిలిచారు తన తోటి మిత్రులు. వివరాలలోకెళితే నగరంలోని రంగశాయిపేటలో కత్తెరపల్లి హరీష్ (39) అనే వ్యక్తి అనారోగ్య సమస్యతో ఇటీవల అకాల మరణం చెందాడు. హరీష్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనతో 2001 సంవత్సరం వరకు రంగశాయిపేట శారద విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న బాల్య మిత్రులు హరీష్ కుటుంబానికి చేయూతనందించాలనే ఉద్దేశంతో అందరూ కలిసి రూ. 33వేలను శుక్రవారం హరీష్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ చిన్న వయసులోనే మరణించడం బాధాకరం అని తెలిపారు. అతని కుటుంబానికి భవిష్యత్తులో ఎల్లవేళలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హరీష్ బాల్యమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## హెచ్‌ఎంగా కోటయ్య నియామకం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తివీరప్పగూడెం ప్రధానోపాధ్యాయులుగా గుడిపాటి కోటయ్యకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డిఈఓ బొల్లారం బిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం తోటి ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తానని, విద్యార్థుల అభివృద్ధిని నిరంతరం ఉపాధ్యాయులు కాంక్షిస్తారని ఉపాధ్యాయులందరి సహకారంతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి,పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన గుడిపాటి కోటయ్యను ఉపాధ్యాయ బృందం యడవల్లి దామోదర్ రెడ్డి,పోరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జలరాం,చంద్రకళ, సీతారాములు,రవికుమార్, రేణుక తదితరులు అభినందించారు.




## ప్రశాంత్ చొరవతో పొలాలకు దారి

- వాన కాలంలో ఇబ్బందులు రాకుండా..
- సొంత ఖర్చుతో మురం పోయించిన యువ నేత మద్దుల
- 150కి పైగా ట్రిప్పుల మొరం దారి బాగుకు తరలింపు

**వేద న్యూస్, వీణవంక:**



యువ నేత ప్రశాంత్ పటేల్ మద్దుల కర్షకుడికి అండగా నిలిచేందుకు తనవంతు ప్రయత్నం చేశాడు. మాటల్లో చెప్పడం కాకుండా చేతల్లో చేసి చూపించాడు. వీణ వంక మండల పరిధిలోని లస్మక్క పల్లి గ్రామం నుండి మామిడి తోటకు వెళ్లే రహదారి తో పాటు ఆ మార్గంలో ఉన్న పొలాలకు ప్రతినిత్యం రైతులు వెళుతూ ఉంటారు. ఈ వర్షాకాలంలో ఆ రహదారి బురద మయంగా మారి ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడతాయని.. ముందు చూపుతో ప్రశాంత్ తన సొంత ఖర్చులతో దాదాపు 150 ట్రిప్పుల మొరం పోయించి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తన వంతు సహాయంగా రహదారి ఏర్పాటు చేయాలని సంకల్పంతో..ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు రైతులు ప్రశాంత్ సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు దాసరపు లక్ష్మణ్ వెంకట్ రెడ్డి, సమ్మిరెడ్డి, కోమల్ రెడ్డి, సంపత్, రాజిరెడ్డి, కుమార్ కొండల్ రెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు. కాగా, "ఉన్న ఊరుకి సేవ చేస్తే.. కన్నతల్లికి సేవ చేసినట్టుగా భావించాలని, యువ నాయకుడు ప్రశాంత్ పటేల్ తన శక్తి మేరకు.. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తనవంతు ప్రయత్నము ఎల్లవేళలా చేస్తుండడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి, నాయకుడు కొమ్మిడి రాకేష్ రెడ్డి సహాయ సహకారాలు.. అండదండలతో.. ప్రజాసేవలో తాను మరింత ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా ప్రశాంత్ పటేల్ వెల్లడించారు. తమకు వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు చూపుతో.. మొరం పోయించి దారిని బాగు చేయించినందుకు యువనేత ప్రశాంత్ పటేల్ కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై పీడీ యాక్ట్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

రాష్ట్రంలో తొలి సారి నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై వరంగల్ పోలీస్ కమిషనర్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులతో పాటు కాలం తీరిన పురుగు మందులను విక్రయించిన వరంగల్ మట్టేవాడకి చెందిన ఇరుకుళ్ళ వేద ప్రకాష్ పై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను మట్టెవాడ ఇన్స్ స్పెక్టర్ తుమ్మ గోపి నిందితుడికి పరకాల జైలులో అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు మరో ఆరుగురు నిందితులతో కలసి ఒక ముఠా ఏర్పడి.. కాలం చెల్లిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుండి తక్కువ డబ్బుకు కొనుగోలు చేయడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తూ మట్టెవాడ పోలీసులకు గత నెల ఏప్రిల్ 7 వ తారీఖున చిక్కడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 49 లక్షల52 వేల రూపాయల విలువ గల నకిలీ విత్తనాలు, పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుడు మరో మారు నెల 26వ తారీఖున నకిలీ పురుగు మందులు విక్రయిస్తుడడంతో మట్టెవాడ పోలీసులు మరో మారు అరెస్ట్ చేసి అతని నుండి 11వేల రూపాయల విలువ నకిలీ పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు అయినట్లు సీపీ వెల్లడించారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, పరుగు మందులను విక్రయిస్తే పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయబడుతుందని.. అలాగే ఎవరైనా విక్రయిస్తే 7799848333 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం ఫీజు రాయితీ

మొదటి పేజీ తరువాయి

జిల్లా డిఈఓ కి తెలియపరచగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ రాము జర్నలిస్టుల పిల్లలకి 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని టీఎస్ జెయు నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ జేయు గౌరవ అధ్యక్షులు డి మురళి, అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తరి రాజశేఖర్, మాట్లాడుతూ... జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో పనిచేస్తున్నటువంటి టీఎస్ జేయూ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని ఇవ్వడం పట్ల జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,డీఈఓ రాము, సూపరిండెంట్ విజయ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ దివాకర్, మీడియా ఇంచార్జ్ రవి రాజ్, ఈసీ మెంబర్లు గట్ల శ్రీనివాస్, సయ్యద్ ఫిరోజ్, శ్రీనివాస్ నాయక్, సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా మురుగు కాలువలు

**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం మడికొండ వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉన్న మురుగు కాలువల దుస్థితి అధ్వానంగా ఉందని, ఇకనైనా ఆ మురుగు కాలువల పరిస్థితి మారదా అన్నట్టు స్థానికులు మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత కొంత కాలంగా మురుగు కాలువల సమస్యలపై స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తేవడంతో, సంబంధిత అధికారులు స్థానిక ప్రజల ఇంటి ముందు ఉన్న కాలువల పైకప్పులు జెసిబి సహాయంతో పెకిలించి రోడ్డు పక్కన పడవేశారు. కానీ సమస్య ఒక చోట ఉండగా, మరోచోట అధికారులు స్థానిక ప్రజల ఇంటి ముందు ఉన్న మురుగు కాలువలపై ఉన్న పైకప్పులను తొలగించారన్నారు. ఇదే క్రమంలో గత 15 నుండి 20 రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపుతామని అధికారులు హామీ ఇచ్చిన ఇప్పటివరకు నెరవేరలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. వారి చుట్టూ తిరుగుతున్న కూడా ఇంకా సమస్య పరిష్కారం కావట్లేదని, చిన్నపిల్లలు, వృద్ధులు తమ ఇంటి ముందు ఉన్న మురుగు కాలువలను దాటుతున్నప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భయం గుప్పిట్లో బ్రతుకుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్య పట్ల మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073